ప్రజాశక్తి

శుక్రవారం 18 ఆగస్టు 2023 5 అనంతపురం





శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ పి.కోటేశ్వరరావు

రీ సర్వేతో భూవివాదాలకు పరిష్కారం

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ పి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్


భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిని పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ పి.కోటేశ్వరరావు మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం అనంతపురం నగరంలోని ఎస్‌జెఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీసర్వేపై అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు చెందిన వార్డు రెవెన్యూ కార్యదర్శులు, అభివద్ధి, ప్లానింగ్ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలోపు రీసర్వే పూర్తి చేసి యజమానులకు భూ హక్కు పత్రాలను అందిస్తామన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి రీసర్వేను విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ రీ సర్వే ముఖ్య ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని, ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు రీసర్వేను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలన్నారు. మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి, నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్ఒపి ఆధారంగానే రీ సర్వే చేయాలన్నారు. అడ్మిన్ సెక్రటరీలు పూర్తిస్థాయిలో ఈ రీసర్వేలో పాలుపంచుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ సుబ్బారావు రీసర్వేకు సంబందించిన 23 రకాల అంశాలను కార్యదర్శులకు కూలంకషంగా తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, మున్సిపాలిటీల కమిషనర్‌లు, అడ్మినిస్ట్రేటివ్, ప్లానింగ్, సచివాలయ రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయకట్టు 'కలే'నా..?

◆ హంద్రీనీవా మొదటి విడతకు అందని నీరు
◆ దశాబ్దకాలంగా నీరొస్తున్న ఆయకట్టుకు నీరులేదు



హంద్రీనీవా కాలువ (ఫైల్ ఫొటో)



ఆయకట్టు భూమి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా మొదటి దశ కింద ఆయకట్టుకు నీరు కలగానే మిగిలిపోతోంది. 2012 నుంచి ఏటా శ్రీశైలం నుంచి అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ద్వారా నీరొస్తూనే ఉంది. దశబ్ధకాలం దాటినా మొదటి దశ కిందనున్న ఆయకట్టుకు నీరందించే పంటకాలువల నిర్మాణం మాత్రం పూర్తవలేదు. ఇప్పటికీ భూసేకరణ వద్దనే ఆగిపోయి ఉంది. మరోవైపు కొత్తగా ఈ ప్రాజెక్టు కింద నీటి కేటాయింపులు పెరిగిపోతూనే ఉన్నాయి. కాని ప్రాజెక్టు రూపకల్పన సమయంలోనే నిర్ణయించిన ఆయకట్టుకు నీరందించే పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

మొదటి దశ కింద 1.18 లక్షల ఆయకట్టు ప్రతిపాదన

హంద్రీనీవా మొదటి దశ కింద 1.18 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రాజెక్టు రూపకల్పన సమయంలోనే నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుతోపాటు పంటకాలువల నిర్మాణం చేపట్టాలన్నది లక్ష్యం. మొదటి దశ కింద శ్రీశైలం మాల్యాల నుంచి జీడిపల్లి వరకు ఉంటుంది. ఇంతదూరం వరకు 2012వ సంవత్సరం నుంచి నీటిని తీసుకొస్తూనే ఉన్నారు. సగటున 20 టిఎంసిలకుపైగానే నీరు ఏటా వస్తోంది. పంట కాలువల నిర్మాణం చేపట్టేందుకుగానూ ప్యాకేజీ 33, 34, 36-ఎ, 368 ప్యాకేజీలున్నాయి. ఇందులో ప్రధానంగా ఉరవకొండ ప్రాంతంలోనే సాగునీటిని అధికంగా అందించేందుకు వీలుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే హంద్రీనీవా కింద కలిపి మొత్తం రూ.917 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా రూపొందించారు. ఈ నిధులు విడుదలయిన తరువాత భూసేకరణ చేపట్టాక పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు. అయితే ఇప్పటికి ఇది పూర్తవుతున్నది మాత్రం తెలియని పరిస్థితి నెలకొంది. ఫలితంగా కళ్లేదుటే నీరు పోతున్నా ఆయకట్టుకు వాడుకోలేని పరిస్థిత రైతుల్లో నెలకొంది. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో గతంలో పెద్దఎత్తున ఆందోళనలు సైతం నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉండగా వైసిపి నాయకులు సైతం ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కాని అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో దీనిపై కదలిక లేదు.

ఆయకట్టుకు నీరివ్వాలి

చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎపి రైతు సంఘం.

హంద్రీనీవా మొదటి దశ కింద ఆయకట్టుకు నీరందించే పంటకాలువల నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే చేపట్టాలి. ఇది పూర్తయితే 1.18 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. ఇప్పటికే దశబ్ధకాలంగా నీరున్నా రైతులు వాడుకోలేని దయనీయ స్థితి నెలకొంది. బడ్జెట్‌లో నిధులను కేటాయించి పంటకాలువల నిర్మాణాన్ని పూర్తి చేయాలి. అది చేసినప్పుడే ప్రాజెక్టు అసలు లక్ష్యం నెరవేరినట్టవుతుంది.



విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

23 నుంచి 'విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర'

◆ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పర్యటన
◆ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలి
◆ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు 'ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర'ను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్లను గురువారం నాడు అనంతపురంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. వాటి పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సైకిల్‌యాత్రను నిర్వహించి ప్రభుత్వాలను కదిలించడం స్వాగతించదగిన పరిణామం అన్నారు. సైకిల్ యాత్ర ఆగస్టు 23వ తేదీ తాడిపత్రి పట్టణంలో ప్రారంభమై గుత్తి, గుంతకల్, వజ్రకరూరు, ఉరవకొండ, కనేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మీదుగా అనంతపురం పట్టణానికి 30వ తేదీ చేరుకుంటుందన్నారు. జిల్లాలోని సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించి తొమ్మిదేళ్లు పూర్తవుతున్న కనీసం ప్రహరీ నిర్మాణం కూడా పూర్తి చేయలేని దుస్థితి ఉందన్నారు. యూనివర్సిటీకి సంబంధించి అధ్యాపక పోస్టులు భర్తీ చేయలేదన్నారు. విద్యార్థులు సంక్షేమ హాస్టల్లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సంక్షేమ హాస్టల్ భవనాలకు పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను ఇవ్వలేదన్నారు. శింగనమల, ఉరవకొండ, తాడిపత్రి, ఆత్మకూరు, గుత్తి, జూనియర్ కళాశాలలో సరైన సదుపాయాలు లేవన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి అనుబంధ హాస్టళ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కస్తూరిబా గర్ల్స్ విద్యాలయాల్లో సీట్లకు డిమాండ్ ఉందని, అందుకు అనుగుణంగా సీట్లు కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కొన్ని రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో విద్యార్థులపై లైంగిక దాడులు జరిగినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం విచారకరం అన్నారు. డిగ్రీ విద్యకు సంబంధించి మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాలు తీసుకొచ్చి నాలుగేళ్ల వ్యవధికి పెంచి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా నారాయణ, శ్రీచైతన్య ఇతర కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు అడ్డగోలుగా పెంచి వసూలు చేస్తున్నా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల స్పందన లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సైకిల్ యాత్రకు మేధావులు, విద్యార్థులు, సంఘీభావం తెలిపి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత, జిల్లా నాయకులు తరిమెల గిరి, రాచేపల్లి సూర్యప్రకాష్, శివ, వర్ధన్ పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన కాంప్లెక్స్ ఎరువులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకు 632.80 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు చేరినట్లు అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు ఎస్ఎం ఎఆర్‌టి కెమికల్స్‌కు సంబంధించిన కాంప్లెక్స్ 10.26.26 ఎరువులు 632.80 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి మార్క్‌ఫెడ్, కాపెనీ గోడౌన్‌లకు తరలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఫార్మాడీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఫార్మాడీ ఆరవ సంవత్సరం రెగ్యులర్ ఇంటర్న్‌షిప్ అస్సెస్‌మెంట్ పరీక్ష పలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్జామినేషన్ బి.చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం JNTUA వెబ్ సైట్ http://jntuaresults.ac.inను సంప్రధించాలని తెలిపారు.

ఈ క్రాప్ నమోదు చేసుకుంటేనే పంటల బీమా

ప్రజాశక్తి-అనంతపురం

రైతులు వారు సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకుంటేనే భవిష్యత్తులో పంటల బీమాను వర్తింపజేస్తారని అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి తెలిపారు. అనంతపురం రూరల్ కొడిమి, తాటిచెర్ల గ్రామాల్లో జరుగుతున్న ఈ- క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జె.శశికళతో గురువారం నాడు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయంగా పెసర, అలసంద, ఉలవ విత్తనాలను 80 శాతం సబ్సిడీతో అందజేస్తుందన్నారు. రైతులు వారి వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుంటే ఈ విత్తనాలను అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ప్రసాద్, విహెచ్ఎ రాజేశ్వరి, లోకేశ్వరి పాల్గొన్నారు.

ఆశ్రమంలో దుస్తుల అందజేత

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని రాయల చెరువు లీలావతి వద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, దోవతులను భోగాలకట్ట గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఆయన తండ్రి కుమ్మెత నాగిరెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా 31 మందికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మెత చంద్రావతి, ఆదినారాయణ రెడ్డి, నారాయణ రెడ్డి, హనుమంత రెడ్డి, వద్ధాశ్రమ నిర్వాహకులు కృష్ణవేణి, విక్రమ్, తేజ పాల్గొన్నారు.

గొర్రెలకాపర్లకు శిక్షణ

ప్రజాశక్తి-శింగనమల

గొర్రెలకు సీజన్ వ్యాధులు సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గొర్రెలకు కాపర్లకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నాడు మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో నిర్వహించారు. పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పద్మనాభం, వెటర్నటీ డాక్టర్ రామచంద్ర రెడ్డిలు కాపర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఎప్పటికప్పుడు టీకాలు వేయించుకోవడం ద్వారా గొర్రెలకు వ్యాధులు దరిచేరవని చెప్పారు.

జెఎన్‌టియును సందర్శించిన పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలను 1962-1967లో విద్యను అభ్యశించిన పూర్వ విద్యార్థులు మంగళవారం కళాశాలను సందర్శించారు. అనంతరం వారు ఉపకులపతి రంగజనార్ధనను కాన్ఫరెన్స్ హాలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు పూర్వ విద్యార్థుల సహకారం ఎప్పటికీ మరువలేనిది అని అన్నారు. పి.మునికృష్ణ, పరాశక్తి సిమెంట్ హైదరాబాద్ (1962-1967 బ్యాచ్), పూర్వ విద్యార్థులు కళాశాల అభివద్ధికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని తెలిపారు. రాబోవు కాలంలో పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థులను ఉపకులపతి సన్మానించారు. ఈ కార్యక్రమంలో 1962-1967 పూర్వ విద్యార్థులు ఆర్.రమేష్, పి.మునికృష్ణ, పి.రఘునాథ రావు, కె.భాస్కర్ రెడ్డి, కె.వరదాచార్యులు, రెక్టార్ ఎం.విజయకుమార్, డైరెక్టర్లు ఫారిన్ అఫైర్స్, ఆలూమిని డైరెక్టర్ పి.సుజాత, దుర్గా ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి పాల్గొన్నారు.

జెఎన్‌టియు విసితో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు



మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

డిఎంఎకు సిఐటియు వినతి



డిఎంఎకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో పని చేస్తున్న పారిశుధ్య ఇతర విభాగాల్లోని కార్మిక సమస్యల పరిష్కారంపై ఆయా కమిషనర్లు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని, వీటిపై స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని సిఐటియు నాయకులు డిఎంఎను కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కోటేశ్వరరావుకు గురువారం నాడు వినతిపత్రం అందజేశారు. జిల్లా మున్సిపల్ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించేందుకు వచ్చిన ఆయన్ను పిజెఆర్ ఫంక్షన్ హాల్లో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆయా మున్సిపాల్టీల్లో మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతున్నా ఏడాదిగా కమిషనర్లు పట్టించుకోవడం లేదన్నారు. 60 సంవత్సరాల పూర్తియ్యిందన్న కారణంతో తొలగించిన కార్మికులకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. రాయదుర్గంలో సొంత పనులకు కార్మికులను ఉపయోగిస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్ రవీంద్ర యాదవ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు సిపిఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. రెండు సంవత్సరాలుగా బకాయి ఉన్న సరెండర్ లీవ్ అమౌంట్‌ను ఇప్పించాలన్నారు. స్కిల్డ్, సెమీస్కిల్డ్ ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. వీటితో పాటు కార్మికులు దీర్ఘకాలికంగా ఎదర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. దీనిపై డిఎంఎ స్పందిస్తూ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ల వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, ఇంజినీరింగ్ సెక్షన్ నగర ప్రధాన కార్యదర్శి మురళి, రాయుడు, సుబ్బారెడ్డి, పోతలయ్య, నల్లప్ప పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బాచుపల్లి గ్రామానికి చెందిన పలువురు గురువారం నాడు వైసీపీలో చేరారు. పట్టణంలోని రోడ్లు,భవనాల శాఖ అతిథి గహంలో జరిగిన ఓ కార్యక్రమంలో కరిడికొండ పంచాయతీ సర్పంచి కె.రమేష్ నాయుడు ఆధ్వర్యంలో టిడిపికి చెందిన పలువురు కార్యకర్తలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచి కె.రమేష్ నాయుడు, వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, నాయకుడు కె.కృష్ణమోహన్ నాయుడులు వారందరికీ వైసీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి చేస్తున్న అభివృద్ధిని చూసి ఆ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

నేడు శ్రీ జనతా మెడికల్ షోరూం ప్రారంభం



శ్రీ జనతా మెడికల్ షోరూం

ప్రజాశక్తి అనంతపురం

సుదీర్ఘకాలంగా అనంతపురం ప్రజలకు సేవలందిస్తున్న జనతా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ జనతా మెడికల్స్ హోల్‌సేల్ అండ్ రిటైల్ సంస్థను శుక్రవారం నాడు లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ అధినేత అంతపు నాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జనతా మెడికల్స్‌ను ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. విశాలమైన షోరూంలో అన్ని రకాల ఔషధాలు ప్రత్యేకంగా బేబీ కేర్ సర్జికల్స్ ఐటమ్స్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. 20 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం పరిసర ప్రాంతాలకు ఫ్రీ హోం డెలివరీ సౌకర్యం కూడా అందుబాటులో ఉంచామన్నారు. 24 గంటల సేవలు జనతా మెడికల్స్ ద్వారా ప్రజలకు అందించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటలలోపు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ మహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య హాజరవుతున్నట్లు తెలిపారు.



ఎ.నాగిరెడ్డి

అధ్వానంగా వేపరాల క్రాస్ రోడ్డు

◆ ఇసుక లారీల రవాణాతో గుంతలమయం ◆ ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు



గుంతల మయంగా మారిన వేపరాల క్రాస్ రోడ్డు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని వేపరాల క్రాస్ రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. పలు ప్రాంతాలకు వెళ్లేందుకు అనుసంధానంగా ఈ రహదారి ఉంది. కళ్యాణదుర్గం, బెలుగుప్ప ప్రాంతాలకు చెందిన వారు కనేకల్, బళ్ళారి ప్రాంతాలకు వెళ్లాలంటే వేపరాల క్రాస్ మీదుగానే ప్రయాణం చేయాల్సి ఉంది. అనంతపురం - రాయదుర్గం జాతీయ రహదారి ఉపయోగంలోకి రాని సమయంలో ఈ మార్గమే (గుండ్లపల్లి రోడ్డు) ప్రధానంగా వినియోగంలో ఉండేది. గతేడాది కురిసిన వర్షాలతో పాటు, బైరవానితిప్ప ప్రాజెక్ట్ నుంచి వేదవతి హగరి పరివాహక ప్రాంతం నెలలపాటు ఏకధాటిగా ప్రవహించింది. దీంతో వేపరాల (రాయదుర్గం మండలం), గుండ్లపల్లి(బెలుగుప్ప మండలం) మధ్య ఉన్న కాజ్వే కొట్టుకుపోయింది. వేపరాల క్రాస్ నుంచి కాజ్వే దాటగానే గుండ్లపల్లి (బెలుగుప్ప మండలం, ఉరవకొండ నియోజకవర్గం), గుండ్లపల్లి దాటగానే కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాలను అనుసంధానిస్తూ ఈ రహదారి ఉండేది. రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం వెళ్లేందుకు గతంలో ఈ రహదారి ఉపయోగంలో ఉండేది. గత ఏడాది జాతీయ రహదారిని అనుసంధానిస్తూ వేదవతి హగిరిపై నూతనంగా నిర్మించిన వంతెన ఉపయోగంలోకి రావడంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. కొంతకాలానికి వేదవతి ప్రవాహంతో పాత కాజ్వే కొట్టుకుపోయింది. దీంతో తప్పనిసరిగా కనేకల్, బళ్ళారి - కళ్యాణదుర్గం వైపు వెళ్లే వాహనాలు కూడా జాతీయ రహదారిపై ప్రయాణించాల్సి వచ్చింది. ప్రస్తుతం వేపరాల క్రాస్ సమీపంలో ఇసుకరీచ్ ఉండడంతో టిప్పర్లు ఎక్కువ సంఖ్యలో రోజు తిరుగుతుంటాయి. దీంతో ఈ రోడ్డు గుంతల మయంగా మారి మరింత అధ్వానంగా తయారైంది. గతంలో కళ్యాణదుర్గం నుంచి బళ్లారికి కూరగాయలను తీసుకెళ్తున్న వాహనం గుంతలను తప్పించబోయి బోల్తా పడింది. ఇటీవల పరుపులను తీసుకెళ్తున్న ఓ ఆటో అదుపుతప్పి పడిపోయింది. ఇలాంటి ఘటనలు ఈ రోడ్డులో తరచూ జరుగుతున్నాయని వేపరాల, నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డు మలుపులో గుంతలు ఉండడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలు లేకుండా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వేపరాల గ్రామస్తులు కోరుతున్నారు.

జాతీయ రహదారికి మార్పు...

గతంలో రోడ్లు మరియు భవనాలు శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డు జాతీయ రహదారికి అప్పగించినట్లు ఆర్అండ్‌బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఈ విషయంపై నేషనల్ హైవే అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాసులును ప్రజాశక్తి వివరణ కోరగా వేపరాల క్రాస్ నుంచి గుండ్లపల్లి మీదుగా జాతీయ రహదారిని అనుసంధానించేలా పది మీటర్ల వెడల్పుతో రెండున్నర కిలోమీటర్ల రోడ్డు వేసేందుకు, కొట్టుకుపోయిన కాజ్వే స్థానంలో నూతన కాజ్వే నిర్మాణం చేసేందుకు 29 కోట్ల రూపాయల ప్రతిపాదనలతో గత ఏడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులను చేపడతామన్నారు.


ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

నవరత్నాలు ప్రజలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గార్లదిన్నె

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలు ప్రజలకు వరమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో గురువారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపి తలారి రంగయ్య, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, ఎంపిడిఒ తేజోత్స్న, తహశీల్దార్ ఉషారాణి, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామపంచాయతీ 1వ వార్డుకు ఈ నెల 19వ తేదీ పోలింగ్ జరుగుతున్న సందర్భంగా గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులు గురించి వివిధ శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో ఎస్ఐ దిలీప్‌కుమార్, పర్యవేక్షణ అధికారి శ్రీధర్, డిటి మల్లేష్ ప్రసాద్, ఎన్నికల పిఒ రామచంద్రారెడ్డి, స్టేట్-2 అధికారి వెలమనాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

2023 ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని ఎఒ కె.స్వాతి తెలిపారు. మండల పరిధిలోని కదిరిపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఏ పంట సాగు చేశారో ఆ పంటనే నమోదు చేసుకోవాలని, లేనిపక్షంలో నష్టపోయే అవకాశం ఉన్నదన్నారు. అతివృష్టి, అనావృష్టిల కారణంగా లేదా సకాలంలో వర్షాలు కురవక పంటలు నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు వర్తించకపోవచ్చు అని తెలిపారు. అనంతరం ఆర్‌బికె సిబ్బందికి ఈ క్రాప్ బుకింగ్‌పై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎఒ వెంట ఎంపిఇఒ నాగరాజు, ఆర్‌బికె సిబ్బంది ఉన్నారు.


ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఎఒ కె.స్వాతి

NAME OF THE CHAINGE

I GADIPATI LINGAMESWARA RASAVIHARADEVI @ G L RASAVIHARADEVI (Old Name) W/o YALLAM ERRISWAMY residing at # 1-53, Singampalli (V), Atmakur (M), Anantapur (Dist.) Changing my name from GADIPATI LINGAMESWARA RASAVIHARADEVI @ G.L.RASAVIHARADEVI to YALLAM UMADEVI (New Name). Hence for, I am being called as YALLAM UMADEVI for all purposes.

NAME AND DOB CORRECTION

SHAIK MOHAMMED ALI s/o SHAIK ABDUL SUBHAN & DATE OF BIRTH 01-06-1968 Residing at D.No:6/1357- B Bhagya Nagar, Guntakal Anantapuramu (Dist) 515801 (AP)Hereby state that my Name & My Father name & Date of Birth Mention Wrongly printed in (Passport No. L1199094) as MOHAMMAD ALI SHAIKH S/o ABDUL SUBHAN SHAIKH Date of Birth 14-12-1964 Henceforth I am being known and called as SHAIK MOHAMMED ALI Sio SHAIK ABDUL SUBHAN & Date of Birth 1-6-1968 for All purposes.

In the court of the IIIrd Addl.Junior Civil Judge, (Execise Court) Ananthapuramu
O.S.No:215/2019

Between:
1.Uppara Subbarayudu
2.Uppara Nagaraju ...plaintiff
And
1.G.Sreenivasulu
2.Sake Siva Kumar ...Defendants

Notice to Defendants

To
1.G.Sreenivasulu S/o G.Obulesu aged about 39 years, Hindu, R/o Muttala (V), Athmakur (M), Ananthapuramu (District).
2.Sake Siva Kumar S/o Sake Obanna aged about 40 years, Hindu, R/o D.No:28-3-299, Sarada Nagar, Ananthapuramu Town.

పై నెంబరు దావాలోని ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 28/08/2023వ తేది నాడు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
V.BHARADWAJA PADMANANDHA TEJA,
ADVOCATE, ANANTHAPURAMU.
CELL:9700713342

In the court of the IIIrd Addl.Junior Civil Judge, (Excise Court) Ananthapuramu
O.S.No:653/2023

Between:
N.Saraswathi ...plaintiff
And
K.J.Christopher Babu ...Defendant

Notice to Defendant

To
K.J.Christopher Babu S/o Karunaiah, R/at D.No:13-1-724, Revenve Colony, Near Ramalayam Temple, Ananthapuramu

పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 24-08-2023వ తేదీ ఉదయం 10-30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలునలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
పి.ఎల్.ఈశ్వర రెడ్డి,
వాదిపరం వకీలు, అనంతపురం
సెల్:9490979003

పారిశుధ్య కార్మికుల సమస్యలపై రాస్తారోకో

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులతో కలిసి పట్టణంలోని వినాయక కూడలిలో గంట పాటు రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇచ్చిన హామీలను అమలు చేయమని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అడుగుతుంటే మౌనంగా ఉండటం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వీరికి సమాన పనికి సమాన వేతనం, ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం సిఐటియు నాయకత్వం పోరాడుతుంటే పోలీసుల చేత దాడులు చేయించడం, అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా సిఎం జగన్ స్పందించి మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే సిఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాస్తారోకోలో సిఐటియు సీనియర్ నాయకులు నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శి మధు, మున్సిపల్ యూనియన్ నాయకులు రాము, తిప్పేస్వామి, బసవరాజు, వెంకటేశులు, మహేష్, అశోక్ కార్మికులు పాల్గొన్నారు.


వినాయక కూడలిలో రాస్తారోకో చేపట్టిన సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు

దయనీయంగా తాడిపత్రి పురపాలక సంఘం

మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

దేశంలో అత్యుత్తమ పురపాలక సంఘంగానున్న తాడిపత్రి పురపాలక సంఘాన్ని ప్రస్తుతం దయనీయంగా మార్చేస్తున్నారని తాడిపత్రి పురపాలక సంఘం ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెసి మాట్లాడారు. అత్యుత్తమ పురపాలక సంఘాన్ని అధ్వానమైనదిగా మార్చే సారని విమర్శించారు. ఎప్పుడో తీసుకొచ్చిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మొత్తం పనికిరాకుండా చేస్తున్నారని ఆరోపించారు. చెత్త సేకరించే బండ్లు కూడా లేకుండా పోయాయని తెలిపారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న మున్సిపాల్టీని నాలుగేళ్లలో అధ్వాన్నంగా మార్చేశారని ఆరోపించారు. పురపాలక సంఘంలో ఏ అభివృద్ధి పని చేయడానికి వెళ్లినా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. తాడిపత్రి పట్టణంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ మంజూరు కాకున్నా ఏ రకంగా అధికారులు శంకుస్థాపన చేశారని తెలిపారు. అది కూడా మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఏ ఒక్క పనినీ సంపూర్ణంగా ఈ కాలంలో చేయలేదని చెప్పారు. ఒక్క పైసా నిధులు తేకున్నా అభివృద్ధిని మాత్రం అడ్డుపడుతున్నారన్నారు. రూల్ ఆఫ్ లా అన్నదే లేకుండా పోయిందన్నారు. ప్రబోధానంద కేసులో 700 మందిపై కేసులు పెట్టి 600 మందిని జైలుకు పంపారన్నారు. ఈ విషయంలో అధికారులు తప్పులు చేసారని దీన్ని చట్టబద్ధంగానే ఎదుర్కొంటామని చెప్పారు. ఖచ్చితంగా అధికారులు చట్టాన్ని అమలు చేయలని కోరారు. అలా కాకుంటే ప్రతి చర్య తప్పదని హెచ్చరించారు.

శాశ్వత భూహక్కుపై గ్రామసభలు

ప్రజాశక్తి-నార్పల

శాశ్వత భూహక్కు, భూరక్ష రీ సర్వేన గురువారం సర్పంచి సాకే రామాంజనేయులు అధ్యక్షతన మండల పరిధిలోని శిద్ధరాచెర్ల, దుర్గం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సురేష్‌బాబు, మండల సర్వేయర్ బ్రహ్మానందం మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో గ్రామ, వార్డు సచివాలయం ఆధ్వర్యంలో సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఆధునిక సాంకేతికతతో సర్వే నిర్వహించి రైతులకు స్థిర ఆస్తులకు శాశ్వత భూహక్కు కార్డులు ఇస్తారన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్యతో భూకమత పటాలను ఉచితంగా సర్వే చేసి వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష హద్దురాళ్లను నాటిస్తామన్నారు. ఈ గ్రామాల్లో రీ సర్వే 6 నెలల్లో పూర్తి అవుతుందని తెలిపారు. సర్పంచి రామాంజనేయులు మాట్లాడుతూ వందేళ్ల క్రితం బ్రిటిష్ వారు శిస్తు కోసం సర్వే చేశారు. ఇప్పుడు సిఎం జగన్ బృహత్తరమైన రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో ఏ భూమికి సంబంధించి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ సర్వే చేపట్టారన్నారు. మన గ్రామాల్లో సర్వే చేసే సమయాల్లో సర్వేకి వచ్చిన సిబ్బందికి హద్దు రాళ్లను చూపించి సహకరించి ఎలాంటి వివాదాలు లేకుండా సర్వేని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుళ్లాయప్ప, విఆర్ఒ పెద్దన్న, మౌనిక, లక్ష్మీ, గ్రామ సర్వేయర్ శ్రీకాంత్, జగన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మదిగుబ్బలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలోని మదిగుబ్బ గ్రామంలో జరుగుతున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ యుగంధర్, మెడికల్ కాలేజీ సామాజిక వైద్య విభాగం పిజి వైద్య విద్యార్థులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు, ఆత్మకూరు ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు, జీవన విధానాన్ని పరిశీలించి సూచనలు సలహాలు ఇచ్చారు. డా. యుగంధర్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించడంతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ఫామిలీ డాక్టర్ విధానంలో హాజరై పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, చిన్న పిల్లలకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. అలాగే ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ మాత్రలు వేశారా లేదా అని పాఠశాలలో వాకబు చేశారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సుజాత, డాక్టర్ సబీహా సుల్తానా, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వైద్యాధికారులు

పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనంత

అనంతపురం : సాధించాలనే కసికి కృషి తోడైతే విజయం మన సొంతమవుతుంది అంటూ 'ఎస్ కాంపిటేటివ్ పబ్లికేషన్స్' రచయిత ఆర్.నాగమునీంద్రరెడ్డి రూపొందించిన పుస్తకాన్ని గురువారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అలాగే చిన్న వయస్సులోనే చక్కటి ప్రతిభ కనుబరుస్తున్న నాగమునీంద్రరెడ్డిని అభినందించారు. పుస్తక రచయిత నాగమునీంద్రరెడ్డి మాట్లాడుతూ వివిధ అకాడమీల్లో తెలుగు సబ్జెక్ట్‌ను బోధిస్తున్నానని తెలిపారు. టెట్, డిఎస్సీ, తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే యువతకు ఈ పుస్తకం ఎంతో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు చింత సోమశేఖర్ రెడ్డి, లక్ష్మన్న, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నా..

డా॥ఎమ్‌డి.నాగభూషణం బాబ్జీ

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియులో పనిచేస్తున్న ఎమ్‌డి. నాగభూషణం సస్పెన్షన్‌పై సుదీర్ఘకాలంగా సందిగ్ధం నెలకొంది. ఈ నేపథ్యంలో నాగభూషణం గురువారం నాడు విలేకరులతో మాట్లాడారు. సంవత్సరం కాలంగా తన సస్పెన్షన్‌పై ప్రభుత్వం, అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం లేదన్నారు. ఈ విషయంపై తాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి లేఖసైతం రాశానని చెప్పారు. ఇప్పటికీ తాను ప్రభుత్వ నిర్ణయం కోసం వేచిచూస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాలపై త్వరలో నా నిర్ణయాన్ని వెల్లడిస్తానని ఆయన తెలియజేశారు. ఇంతవరకు తనకు సహకరించిన ఉద్యోగులు, బిసి,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సంఘాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-బెళుగుప్ప

ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘం సభ్యులకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 35 వేలు బ్యాంకు లోన్ ద్వారా అందజేస్తారని మండల్ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య తెలిపారు. స్థానిక సమైక్య కార్యాలయంలో గురువారం విఒఎల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న 600 మంది సభ్యులను గుర్తించి వారు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి రూ. 35 వేలు లోన్ అందిస్తున్నామన్నారు. లోన్ తీసుకున్న మహిళలు కంతుల ద్వారా చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం ఆంజనేయులు, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు సుజాత, విఒఎలు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి


డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

ప్రజాశక్తి-అనంతపురం

సమాజ హితం కోసం పాటుపడుతున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందిస్తామని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం "ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఎపియూడబ్ల్యూజె) 67వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎపియూడబ్ల్యూజె పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 25 మంది వెటరన్, రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ముఖ్య అతిథులు డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి శాలువాలు కప్పి, బొకేలు, గిఫ్టులు అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లా కమిటీ కన్వీనర్ పయ్యావుల ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోగటం మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అభివృద్ధి, పార్కింగ్ ప్లేస్, ఇళ్ల స్థలాలు లేని పాత్రికేయుల కోసం స్థల సేకరణకు కృషి చేస్తానన్నారు. వాసంతి మాట్లాడుతూ సమాజం పట్ల జర్నలిస్టుల కృషి ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు గుత్తా ప్రభాకర్ నాయుడు, పతకమూరి నాగరాజు, ఆజాద్, ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డేనియల్, సబ్ ఎడిటర్లు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ రామాంజనేయులుకు ఘన సన్మానం

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఎపియుడబ్ల్యుజె) ఆవిర్భావ దినోత్సవం పురస్కరించు కొని గురువారం అనంతపురం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఉరవకొండ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు డి.రామాంజనేయులును యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. రామాంజనేయులు గతంలో విశాలాంధ్ర, ఆంధ్రప్రభ, సాక్షి, తదితర పత్రికల్లో పనిచేశారు. దాదాపు 40 ఏళ్ల పాటు జర్నలిస్టు వత్తిలో పనిచేసిన రామాంజనేయులు సేవలను పలువురు కొనియాడారు.


సీనియర్ జర్నలిస్టు రామాంజనేయులును సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

'అనంత కరువు' పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విశాలాంధ్ర బుక్ హౌస్ విశ్రాంత మేనేజర్ భార్య ఉమాదేవి రచించిన అనంత కరువు, ఇనపగజ్జల తల్లి పుస్తకాలను జిల్లా గ్రంథాలయానికి అందజేశారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డిని కలిసి విశాలాంధ్ర బుక్‌హౌస్ విశ్రాంత మేనేజర్ చెట్ల వీరన్న అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, రచయిత పి.రమేష్ నారాయణ, షేక్ రియాజుద్దీన్, నాగరాజు, ఎస్.రమేష్, కమలనాథ్, ఉప గ్రంథాలయ అధికారి వి. సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ కె.శివ శంకర్, ఇంతియాజ్ అహమ్మద్, కావేరి పాల్గొన్నారు.


శ్రీవైష్ణవికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తున్న శ్రీచైతన్య యాజమాన్యం

నృత్య పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థినికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

హైదరాబాద్‌లో కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్రీవైష్ణవి ప్రతిభ చాటింది. జాతీయస్థాయిలో బృంద డాన్స్ విభాగంలో ప్రథమ బహుమతి, సోలో డాన్స్ విభాగంలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. దీంతో శ్రీవైష్ణవికి ఎజిఎం సుబ్బారెడ్డి ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబసుం, వైస్ ప్రిన్సిపల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసు, డీన్‌లు మహేష్, అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ఎఒ గోపాల్ పాల్గొన్నారు.

ఇందిరకు డాక్టరేట్ ప్రదానం



ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని ఎన్.తిమ్మాపురం గ్రామానికి చెందిన చిదానందరెడ్డి కుమార్తె ప్యాట్లో ఇందిర శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో 'డాక్టర్ వి.చంద్రశేఖరరావు కథలు-పరిశీలన' అంశంపై డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో పరిశోధన చేసి తెలుగు అధ్యయన శాఖలో పిహెచ్‌డి(డాక్టరేట్) పట్టా పొందారు. విషయం తెలుసుకున్న విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, తదితరులు ఇందిరకు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

బండమీదపల్లిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామంలో గురువారం టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, కావున రాబోయే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దేగల క్రిష్ణమూర్తి, చంద్రాయుడు, సీనియర్ నాయకులు మారుతీనాయుడు, మాసూల చంద్రమోహన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, నార్పల మండల కన్వీనర్ ఎర్రనాగప్ప, శింగనమల గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, ఎర్రిస్వామి, ముంత వెంకటేష్, కొయ్య గురు పెద్దన్న, రాఘవ నాయుడు, నడిందొడ్డి సర్పంచి నాగార్జున, పాల్గొన్నారు.


పల్లె ఉమ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు


గుత్తి ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీ సాయి కళాశాల యాజమాన్యం

పల్లె ఉమ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-అనంతపురం

బాలాజీ విద్యాసంస్థల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్నత చదువులను అందరికీ అందుబాటు లోకి తీసుకురావడానికి, సేవా కార్యక్రమాలు ద్వారా ప్రజలకు సహాయం చేయడంలో పల్లె ఉమ సేవలు మరువలేని వని పివికెకె డిగ్రీ, పీజీ కళాశాల, బాలాజీ బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపళ్లు పేర్కొన్నారు. పల్లె ఉమ జయంతి సందర్భంగా గురువారం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగ పిల్లల పాఠశాలకు 2 బియ్యం బస్తాలు, క్రీడా సామగ్రిని అందజేశారు. అంతకు ముందు కళాశాల ప్రాంగణంలో పల్లె ఉమ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డా. వై. మునికృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి(బి.ఎడ్), వైస్ ప్రిన్సిపల్ వీరప్రకాష్, ఎఒ ధనుష్, సిబ్బంది నాగరాజు, మహేష్, రమణ, శ్రీనివాసరావు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ముందుగా శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో పల్లె ఉమ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. అలాగే పట్టణ శివారులోని గుత్తి-అనంతపురం రోడ్డులో ఉన్న కాశిరెడ్డి నాయన ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ సాయి కళాశాలల క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లు రెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసన్నకుమార్, డాక్టర్ తారకేశ్వర్, ప్రగతి జూనియర్ కళాశాల నాగశేఖర్, నిజాముద్దీన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఆశా యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

ఈ ఆశా యాప్ ఆన్‌లైన్ సేవలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ సూచించారు. ఈ ఆశా యావ్ ఆన్‌లైన్ సేవలపై గురువారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం లో ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అందించే అన్ని రకాల ఆరోగ్య సేవలను ప్రభుత్వం రూపొందించిన ఈ ఆశా యాప్ అప్లికేషన్‌లో ఆశా వర్కర్స్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవలన్నీ ఈ యాప్‌లో నమోదు చేయాలన్నారు. యావ్‌లో ఎలా నమోదు చయాలో ఆశాలకు వీడియో రూపంలో ప్రదర్శించి వివరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డా. మహేంద్రనాథ్, డా. మోనోజ్, డిసిఎం శ్రీరాములు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు విధులకు తప్పకుండా హాజరై ప్రతి రోజు యాప్‌లో లాగిన్ కావాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ అసిస్టెంట్స్, ఆశాలు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యశాలలు

బుక్కరాయసముద్రం : ప్రభుత్వం పేదలకు అందుబాటులో ఆసుపత్రులు ఏర్పాటు చేసిందని ఎంపిపి దాసరి సునీత పేర్కొన్నారు. మండల పరిధిలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎంపిపి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కోసం కొన్ని తీర్మానాలు చేశారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ నాడు-నేడు పనుల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. కొర్రపాడు ఆసుపత్రిని కూడా అభివృద్ధి చేశారన్నారు. పిహెచ్‌సిలో నెలకు 10 చొప్పున సాధారణ కాన్పులు చేయాలని, రోగులకు అన్ని మందులు అందుబాటులో వుండాలని, అన్ని పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ విజయభాస్కర్, కొర్రపాడు సర్పంచి కామాక్షమ్మ, వైసిపి నేత విజయభాస్కర్‌రెడ్డి, రోటరీపురం నాగభూషణం, ఇఒఆర్‌డి దామోదరమ్మ, పిహెచ్‌సి డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూదొందే..

ప్రజాశక్తి-తాడిపత్రి

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం నిర్మాణం, నిర్వాసితుల పరిహారం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందే అని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రంగయ్య అధ్యక్షతన గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ 'రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం' నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రచారజాతా ఆగస్టు 17న విశాఖపట్నంలో ప్రారంభమై సెప్టెంబర్ 8వ తేదీ తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. సమావేశంలో వ్యకాసం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి, గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు వైఎల్ రామాంజనేయులు. ఎపి వ్యకాసం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దయ్య, తాడిపత్రి పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు, నాగేంద్ర, మండల కార్యదర్శి నాగరంగయ్య, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి శీన, రత్నమయ్య పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని చితకబాదిన ఘటనలో ప్రిన్సిపల్ వీరేష్, ఆధ్యాపకులు శ్రీనివాసులు, ఆజాద్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఎఐఎస్ఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఎఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి కోట్రేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం వారు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇషాక్‌ను తోటి విద్యార్థుల మధ్య విచక్షణ రహితంగా కొట్టడం దారుణమన్నారు. దీంతో సదరు విద్యార్థి తీవ్ర మనోవేదనకు గురై మరో కళాశాలలో చేరేందుకు సిద్ధమయ్యాడన్నారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకులు విద్యార్థులపై దాడులు చేయడం సరైన పద్ధతి కాదని, వారు వైఖరి మార్చుకోవాలన్నారు. విద్యార్థిని చితకబాదిన సంఘటన, విద్యార్థి, యువజన సంఘాలపై ప్రిన్సిపల్ వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం(నేడు) జూనియర్ కాలేజీ ఎదుట నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపల్, అధ్యాపకులను సస్పెండ్ చేసేంత వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అలాగే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-గార్లదిన్నె

ముకుందాపురం గ్రామంలో దళిత మహిళపై దాడి చేసిన సూర్యచంద్రారెడ్డి ని వెంటనే అరెస్టు చేయకుండా విచారణ పేరుతో కాలయాపన చేస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగారుస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దాడి జరిగి నెల రోజులు గడుస్తున్నా సూర్యచంద్రారెడ్డిని అరెస్టు చేయకుండా బాధిత మహిళను విచారణ పేరుతో పోలీసులు హింసిస్తున్నారని ధ్వజమెత్తారు. దాడి చేసిన సూర్య చంద్రారెడ్డిని అరెస్టు చేయకపోతే ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని చలో ముకుందాపురం కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే సర్వే నెంబర్-580లో 5.4 ఎకరాల దళితుల భూమి వివాదం కోర్టులో నడుస్తుండగా సిఐ అన్సర్‌బాషా, ఎస్ఐ సాగర్ భూస్వాములకు కొమ్ము కాస్తూ బాధితులను భయపెడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, పాల్గొన్నారు.


క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-బెళుగుప్ప

స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పూర్వ విద్యార్థులు రామేశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి వాలీబాల్, బాల్ బాడ్మింటన్, ఖోఖో, తదితర క్రీడలకు సంబంధించి రూ. 22వేలు విలువచేసే సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు ఈ సాయం అందించామన్నారు. విద్యార్థులు క్రీడల్లో బాగా సాధన చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు మహమ్మద్‌రఫీ, కొండారెడ్డి, శ్రీనివాసులు, రామ్మూర్తి, రమేష్‌నాయక్, గ్రామస్తుఉల పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను కలిసిన విశ్వ, వీరన్న

ఉరవకొండ : సిఎం జగన్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు సిపి వీరన్న గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వీరన్న సిఎం జగన్‌ను ఈ నెల 27వ తేదీ అనంతపురంలో జరిగే తన కుమారుడి వివాహానికి ఆహ్వానించి శుభలేఖ అందజేశారు.


సిఎం జగన్‌ను కలిసిన విశ్వ, వీరన్న